సరస్వతీ.. నమస్తుభ్యం



ధర్మవరంలో సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారి ఆలయాల్లో సరస్వతీదేవిగా అలంకరణ చేశారు. భక్తులకు దుర్గమ్మ, పెద్దమ్మ, గాయత్రి, చౌడేశ్వరి, అంబాభవానీ అమ్మవార్లు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాల్లో అమ్మవార్లను భక్తులు సందర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

- న్యూస్‌టుడే, ధర్మవరం

జాతీయస్థాయి జూడో పోటీల్లో జయసింహకు కాంస్యం

రామగిరి, న్యూస్‌టుడే : గుజరాత్‌లోని మెహసానాలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అక్టోబరు 4 నుంచి 8 వరకూ జరిగిన జాతీయస్థాయి 68వ స్కూల్ గేమ్స్ అండర్-14 జూడో పోటీల్లో నసనకోట ఉన్నత పాఠశాల విద్యార్థి జయసింహకు కాంస్య పతకం సాధించాడు. 25 కేజీల విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చామంతి తెలిపారు. జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించిన జయసింహను, పీడీ చామంతిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగరత్న, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.



సాధించిన కాంస్య పతకాన్ని చూపుతున్న జయసింహ

అంటకాగిన ఆయనకే మళ్లీ పట్టం!

జిల్లా విద్యుత్తుశాఖ ఎస్ఈగా సురేంద్ర

అనంతపురం(విద్యుత్తు), న్యూస్‌టుడే: గతంలో వైకాపా నేతలతో అంటకాగారన్న ఆరోపణలు ఎదుర్కొన్న ఎస్ఈ సురేంద్రను శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్తుశాఖ ఎస్ఈగా నియమిస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. సురేంద్ర వైకాపా ప్రభుత్వ పాలనలో అనంతపురం టౌన్ డివిజన్ ఈఈగా పనిచేశారు. ఇక్కడ పనిచేస్తుండగా ఎస్ఈగా పదోన్నతి పొంది ఉమ్మడి జిల్లాకు పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఈఈ, ఎస్ఈగా పనిచేసిన సమయంలో వైకాపాలో కీలకంగా వ్యవహరించిన ఒక మంత్రి ఏం చెప్పినా ఆ పనులను చక్క పెట్టారన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల ముందు వైకాపా పాలకులు ఇచ్చిన సిఫార్సు లేఖల ఆధారంగా నిబంధనలకు తిలోదకాలిచ్చి వ్యవసాయ సర్వీసులు విడుదల చేసినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల తరువాత సెలవు పెట్టారు. అనంతరం ఆయనకు ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీజీఎం ప్లానింగ్ పోస్టింగ్ ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్తు సర్కిల్‌ను అక్టోబరు 2లోపు ఏర్పాటు చేయాలని సీఎండీ ఉత్తర్వులు జారీ చేసి.. అందుకు అనుగుణంగా సీజీఎం ప్లానింగ్ పోస్టును ఇక్కడికి డైవర్ట్ చేసినా.. ఎస్ఈగా ఎవరినీ నియమించలేదు. సురేంద్ర ఉమ్మడి జిల్లా ఎస్ఈగా పనిచేసిన సమయంలో వైకాపా నేతలు చెప్పిన వారికే వ్యవసాయ సర్వీసులు విడుదల చేశారని, బినామీ పేరుతో కొన్ని ఉపకేంద్రాల నిర్మాణాలను చేపట్టారని, తన అనుయాయులకు సోలార్ రూఫ్‌టాప్‌నకు సంబంధించి అనుచిత లబ్ధి చేకూర్చారని, ఉద్యోగ నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డారని, వైకాపా మంత్రి జిల్లాకు వచ్చినప్పుడల్లా విద్యుత్తు అధికారులతో వసూళ్లు చేసి మంత్రికి రాచమర్యాదలు చేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. వీటిపై కనీస విచారణ చేయకుండానే తిరిగి శ్రీసత్యసాయి జిల్లాకు ఎస్ఈగా పోస్టింగ్ ఇవ్వటంపై విమర్శలు వస్తున్నాయి.

పల్లె ప్రగతికి



ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు

రూ.219 కోట్లు

ఈనాడు, పుట్టపర్తి: వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి పూర్తిగా పడకేసింది. ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. ఫలితంగా రహదారులు, మురుగు కాలవలు అధ్వానంగా మారాయి. జగన్ పాలనలో పంచాయతీలకు కేంద్రం ఇచ్చే నిధుల్ని సైతం దారి మళ్లించడంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. తెదేపా కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులపై నిత్యం అనుశీలన చేస్తున్నారు. పల్లె పండగ పేరుతో రాష్ట్రం అంతటా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు రూ.219 కోట్లు కేటాయించారు. 14 నియోజకవర్గాల్లో ఈనెల 14వ తేదీన ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. రహదారులు, మురుగు పారుదల వ్యవస్థ, పాఠశాలల ప్రహరీ తదితర పనులను చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



తనకల్లు మండలం గద్దలబండ తండా నుంచి కందుకూరు క్రాస్ మధ్య అభివృద్ధి చేయనున్న బీటీ రోడ్డు

ప్రజలదే నిర్ణయాధికారం

ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఆగస్టు, 23న గ్రామసభలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరినీ హాజరుపరిచి అధికారుల సమక్షంలో కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో పెండింగ్ పనులు, జరగాల్సిన అభివృద్ధిపై చర్చించారు. అభివృద్ధి పనులపై ఆయా పంచాయతీల్లో సమష్టిగా నిర్ణయం తీసుకున్నారు. జాబితాల్లో మొదటి ప్రాధాన్యంగా రహదారులు, డ్రైనేజీ నిర్మించాలని నిర్ణయించారు. మినీ గోకులాలు, పశువుల షెడ్ల నిర్మాణానికి తీర్మానాలు రూపొందించారు. ఉపాధి హామీ నిధులతో అన్ని గ్రామాల్లో పనులు చేపట్టనున్నారు. 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్ నిధులు కేటాయించడంతో పనులు వేగంగా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా..

నియోజకవర్గం	మంజూరైన పనులు	నిధులు (రూ.కోట్లల్లో)
హిందూపురం	164	30
పెనుకొండ	305	23
పుట్టపర్తి	304	18
కదిరి	298	18
మడకశిర	223	15
రాప్తాడు	166	09
ధర్మవరం	158	06

శ్రీసత్యసాయికి 1,618 పనులు మంజూరు

శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల పరిధిలో మొత్తం 1,618 పనులు మంజూరు చేశారు. ఇందుకుగాను రూ.119.80 కోట్లు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా 181 కిలోమీటర్లు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.109 కోట్లు మంజూరు చేశారు. తనకల్లు, చిలమత్తూరు, హిందూపురం, నంబులపూలకుంట, గాండ్లపెంట మండలాల పరిధిలో 42 బీటీ రోడ్ల పనులకు రూ.10.10 కోట్లు ఖర్చు చేయనున్నారు. గ్రామసభల్లో తీర్మానించిన మేరకు 5 గ్రామాల్లో పాఠశాలలకు ప్రహరీలు నిర్మించనున్నారు. రూ.20 లక్షలతో 9 పశువుల షెడ్లను ఏర్పాటు చేయనున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తానని డీఎస్పీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వాసుదేవన్ బదిలీపై వెళ్లిన విషయం విదితమే. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధి దర్శనార్థం వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్నను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. డీఎస్పీకి సీఐలు, ఎస్సైలు శుభాకాంక్షలు తెలియజేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

ఖరీఫ్ కంది కళకళ


- భారీగా సాగుకు సర్కారు ప్రోత్సాహం
- పంట మార్పిడి దిశగా అన్నదాతలు



సాగులో కంది పంట

అనంతపురం (వ్యవసాయం), పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఖరీఫ్ పంట కాలం ముగిసింది. సాగు లెక్కలు తేల్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన పంట వేరుసెనగ. పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో వేరుసెనగ సాగు తగ్గిపోయింది. పత్తి పంటది ఇదే పరిస్థితి. ఎన్నడూలేని విధంగా మొక్కజొన్న, కంది పంటలు అనూహ్యంగా పెరగడంతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వేరుసెనగ సాగు చేయాలంటే ఎకరాకు రూ.25 వేలు వెచ్చించాలి. దిగుబడులు తగ్గిపోయి నష్టాలను మూట కట్టుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. దీంతో అనంత రైతులు కంది వైపు మొగ్గు చూపుతున్నారు. ఒక ఎకరాలో కంది సాగుకు రూ.10-12 వేలు ఖర్చవుతుంది. గిట్టుబాటు ధర దక్కడం, బెట్ట పరిస్థితులను తట్టుకునే స్వభావం ఉండడం... విత్తనాలను రాయితీతో ప్రభుత్వం పంపిణీ చేయడం. కంది పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో సాగు భారీగా పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 1,40,456 హెక్టార్లలో సాగైంది. పంట కాలం ఆరు నెలలు. ప్రస్తుతం పూత దశలో ఉంది. డిసెంబరు, జనవరి నెలల్లో పంటకోతకు వస్తోంది. కాయ దశలో తెగుళ్ల ఆశించకుండా పంటను కాపాడుకుంటే ఆదాయం వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. హెక్టారుకు 10 క్వింటాళ్లు దిగుబడి అంచనా వేశారు. దాని ప్రకారం 1,404.56 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

ఉమ్మడి అనంత జిల్లాలో ఇలా..



గిట్టుబాటు ధరతో...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీఫ్ పంటల సాగు సమయంలో మద్దతు ధరలు ప్రకటించాయి. ఈ ఏడాది పంటకు భారీగా మద్దతు ధర కల్పించారు. గత మూడేళ్లలో కంది పంటకు మద్దతు ధరలు పరిశీలిస్తే 2022లో రూ.6,300, 2023లో రూ.7 వేలు, 2024లో 7,550 చొప్పున ప్రకటించారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో కంటే ఎన్డీయే సర్కారు పంటలకు మద్దతు ధర భారీగా ప్రకటించింది.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



ఖరీఫ్‌లో సాగైన కంది పంట ఆశాజనకంగా ఉంది. వచ్చే నవంబరులో పంటంతా పూర్తిస్థాయిలో పూత కొస్తోంది. ప్రస్తుతం శాఖీయ దశ నుంచి పూత దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది. మారుకా మచ్చల పురుగు, పచ్చపురుగు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు ముందుగా వేపనూనె లీటరు నీటికి 5 ఎంఎల్ పిచికారీ చేసుకోవాలి. తీవ్రతను బట్టి క్లోరోపైరోఫాస్ 2.5 ఎంఎల్, లేదా ప్రోఫెనోఫాస్ రూ.2.0 ఎంఎల్ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. - డాక్టర్ మల్లీశ్వరి, ప్రధాన శాస్త్రవేత్త-కేవీకే

కూరగాయలు కొనలేం.. నెల రోజుల్లో ధరల రెట్టింపు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. నెల రోజులుగా పెరుగుతూ సామాన్యులకు అందకుండాపోయాయి. టమాట ప్రస్తుతం మార్కెట్లో రూ.వందకు చేరుకుంది. ఉల్లి కంటతడి పెట్టిస్తోంది. వీటి పరిస్థితి ఇలా ఉంటే బెండ, బీర, క్యారెట్ తదితర కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయి. ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. చాలీచాలనీ జీతంతో జీవితాలను నెట్టుకొస్తున్న వేతన జీవులు తమ వంటింటి బడ్జెట్ బాగా పెరిగిందని ఆవేదన చెందుతున్నారు. భారీ వర్షాలు కురవడంతోపాటు, అనేక ప్రాంతాల్లో పంటలు నీటి మునిగాయి. వాతావరణ మార్పులతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. తక్కువ విస్తీర్ణంలో పండిన కూరగాయలు సాగు చేయడంతో పాటు పండగల సీజన్ నేపథ్యంలో డిమాండ్ విపరీతంగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయలు	ప్రస్తుత ధర (రూ.ల్లో)	నెల రోజుల కిందట (రూ.ల్లో)
టమాటా	70	20
బెండ	40	25
క్యారెట్	50	40
బీర	40	20
కాకర	30	20
ఉల్లి	50	30
దొండ	40	20

87 మద్యం దుకాణాలకు 940 దరఖాస్తులు

14న సాయిఆరామంలో లాటరీ ద్వారా ఎంపిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాల కోసం బుధవారం రాత్రి 9 గంటల వరకు 940 దరఖాస్తులు అందాయి. మొత్తం 86 దుకాణాలకు 940 మంది దరఖాస్తు చేయగా ఒక్కొక్క దానికి సగటున 10కి పైగా దరఖాస్తులు వచ్చాయి. కాగా ఒక దుకాణానికి ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం విశేషం. తిరిగి ఇవ్వని రుసుం రూపంలో ప్రభుత్వానికి రూ.18.80 కోట్ల ఆదాయం వచ్చింది. దరఖాస్తుల స్వీకరణకు 11వ తేదీ వరకూ గడువు ఉండటంతో మరిన్ని దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా కొత్తచెరువు 43వ మద్యం దుకాణానికి 29 దరఖాస్తులు రాగా మడకశిర గ్రామీణం దుకాణానికి ఒక్కటి కూడా రాకపోవడం విశేషం. ఈనెల 11వ తేదీ వరకూ మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఎక్సైజ్ అసిస్టెంటు సూరింటెండెంటు నరసింహులు తెలిపారు. 14వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు పుట్టపర్తి పట్టణంలోని సాయిఆరామంలో కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. 16వ తేదీ నుంచి నూతన మద్యం ఎక్సైజ్ విధానం అమల్లోకి వస్తుందని వివరించారు.

బృహత్తర ప్రణాళిక కనికట్టు.. బయటపెడితే ఒట్టు

- తుది ప్రకటన ఇవ్వరు... ప్రచురణ, ప్రచారం కరవు
- ఇదీ హిందూపురం పురపాలికలో పరిస్థితి



హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే : సింధూ నాగరికత గురించి ఇప్పటికీ చర్చించుకుంటున్నామంటే అందుకు ఆనాటి పట్టణాల్లోని చూడచక్కని రహదారులు, కాలువలు, భవన నిర్మాణాలే కారణం. ఆనాడు ప్రణాళికకు అనుగుణంగా నిర్మించారు. నేడు సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ పట్టణాల్లో ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు జరగడంలేదు. ఫలితంగా పట్టణ ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. హిందూపురం పట్టణ ప్రణాళిక విభాగం రాబోయే 30 ఏళ్లలో ఎలా ఉండాలనే దానిపై దృష్టి సారించకుండా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)పై నిర్లక్ష్యం వహిస్తోంది. తొలి దశలో ప్రజలతో ఎలాంటి చర్చలు జరపకుండా, ప్రణాళిక తయారు చేసే నిపుణులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా గత ఐదేళ్లుగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తూనే వచ్చారు. ఏడాది కిందట సిద్ధమైనట్లు, దానిపై ప్రజాభిప్రాయం కోరుతున్నట్లు మున్సిపల్ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రణాళిక ప్రతిని అధికారులు అందుబాటులో ఉంచలేదు. అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని పౌరులు పేర్కొంటున్నారు. తుది నోటిఫికేషన్ ఇచ్చే ముందు ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలలో ఏవి పరిష్కరించారు. వేటిని తిరస్కరించారు... ఎందుకు అలా చేయాల్సి వచ్చింది చెప్పాలి. ప్రణాళిక అమలుకు మున్సిపల్ కౌన్సిల్ అనుమతి తీసుకోవాలి. ఆ తరువాత ప్రతులను ప్రచురించి, జనంలోకి వెళ్లేలా ప్రచారం చేయాలి. బృహత్తర ప్రణాళిక ప్రకారం పట్టణంలో నిర్మాణాలకు అనుమతులిస్తామని ప్రకటించాలి.

అంతా రహస్యమే...

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు గత కొద్ది రోజులుగా ఎవరికీ తెలియకుండానే బృహత్తర ప్రణాళిక అమలు చేస్తున్నారు. దాని ప్రకారమే భవన నిర్మాణ ప్లాన్‌లను రూపొందించాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు సూచిస్తుండటంతో వారు ఆశ్చర్యపోతున్నారు. నోటిఫికేషన్ ఇవ్వకుండా, కౌన్సిల్ అనుమతి లేకుండా ఎలా అమలు చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. వారి ప్రశ్నలను మున్సిపల్ అధికారులు దాటవేశారు. వైకాపా నాయకులు చెప్పినట్లు మాస్టర్ ప్లాన్ రూపొందించారని, క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా, తయారు చేశారని తెలుస్తోంది. మాస్టర్ ప్లాన్ పూర్తి వివరాలు బయటకు వస్తే, ఇవన్నీ బయటకు వస్తాయని గుట్టుగా అమలుకు శ్రీకారం చుట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చర్చించి.. తగిన చర్యలు తీసుకుంటాం - శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్

ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను పిలిపించి సమీక్ష నిర్వహిస్తాను. మాస్టర్ ప్లాన్ అమలుకు కౌన్సిల్ అనుమతి తీసుకున్నారా..? లేదా..? అనేది పరిశీలిస్తాను. మాస్టర్ ప్లాన్‌లోని అన్ని అంశాలు ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకొంటాను. వాటికి అనుగుణంగా పట్టణంలో నిర్మాణాలు ఉండేలా, అనుమతులు ఇచ్చేలా చూస్తాను.

17 మంది ఎఫ్ఏసీ ఎంపీడీవోల నియామకం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఖాళీగా ఉన్న ఎంపీడీవో పోస్టులను ఆయా కార్యాలయంలో ఏవోలుగా, యూఆర్‌డీవోలుగా పనిచేస్తున్న అధికారులను ఎఫ్ఏసీ ఎంపీడీవోలుగా నియమించారు. బ్రహ్మసముద్రం ఎఫ్ఏసీ ఎంపీడీవోగా నందకిశోర్; కంబదూరు రామచంద్ర, కుందుర్పి బాలాజీ, బొమ్మనహాళ్ దాసనాయక్, శెట్టూరు రఘురామరావు, వజ్రకరూరు రవిప్రసాద్, చిలమత్తూరు రమణమూర్తి, ఎన్‌పీ కుంట అంజప్ప, తలుపుల రామానాయక్, తనకల్లు, రెడ్డప్ప, గుడిబండ గంగాధర్, పరిగి శ్రీధర్‌రావు, రొద్దం రామకుమార్, కొత్తచెరువు నటరాజ్, నల్లమాడ రాబర్ట్‌విల్సన్, కనగానపల్లి అనిల్‌కుమార్, యల్లనూరు వాసుదేవరెడ్డిలను నియమించారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచండి

ధర్మవరం, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా నియంత్రణపై రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమంగా ఇసుక తరలించేవారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆర్డీవో మహేష్ ఆదేశించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులుతో పాటు రెవెన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లు సమావేశంలో పాల్గొన్నారు. బాణసంచా విక్రయాలకు లైసెన్స్‌లు జారీ చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపైన అధికారులతో మాట్లాడారు. అగ్నిమాపక, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మహేష్

కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది నియామకానికి ప్రకటన

కొత్తచెరువు, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బందిని ఒప్పంద, పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్షా అదనపు పథక సంచాలకులు, డీఈవో మీనాక్షి ఒక ప్రకటనలో కోరారు. మొత్తం 44 పోస్టులకు ప్రకటన విడుదల చేశామని తెలిపారు. వయోపరిమితి ఓపెన్ కేటగిరీకి 18-42, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 47, మాజీ సైనికోద్యోగులకు 45, దివ్యాంగులకు 52 సంవత్సరాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 15వ తేదీ సాయంత్రం 4గంటలలోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తులను మండల విద్యాధికారి కార్యాలయాల్లో అందజేయాలని కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు వేళాయె..

16 నుంచి ప్రక్రియ ప్రారంభం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. ఎన్నికల ప్రకటన ఈ నెల 16న విడుదల చేయనున్నారు. ఈ ప్రక్రియను 40 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. గత ప్రభుత్వ పాలనలో సాగునీటి సంఘాల ఉనికి లేకుండాపోయింది. అయిదేళ్లలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో జలవనరుల చెరువులు, ప్రాజెక్టుల నిర్వహణ నీరుగారిపోయింది. నీటి పన్నుల వసూళ్లు, కాలువల మరమ్మతులు, జలాల పంపిణీ తదితరాలన్నీ నిలిచిపోయాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

2015 నాటి జాబితా ప్రకారం..

శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి పారుదల కింద ఉన్న సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని అధికారులు ఏర్పాట్లు చేశారు. 2015లో ఎన్నికల నిర్వహణకు వినియోగించిన జాబితానే ప్రాతిపదికనగా తీసుకోవాలని భావిస్తున్నారు. దీనిలో కొన్ని మార్పులు చేయనున్నారు. జిల్లాలో జనవరులశాఖ పరిధిలో 214 సాగునీటి చెరువులకు 16 జలాశయాల ప్రాజెక్టులకు ఎన్నికలు జరగనున్నాయి.

జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవోగా వెంకటసుబ్బయ్య

అనంతపురం విద్య: జిల్లా పరిషత్తు ఇన్‌ఛార్జి సీఈవోగా వెంకటసుబ్బయ్యను నియమిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఈవోగా నియమితులైన రామచంద్రారెడ్డి విధుల్లో చేరడం ఆలస్యం కావడంతో డిప్యూటీ సీఈవోగా ఉన్న వెంకటసుబ్బయ్యకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

అన్న క్యాంటీన్లు పేదలకు వరం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

కళ్యాణదుర్గం (గ్రామీణం, న్యూస్‌టుడే: రూ.5కే కడుపు నిండా అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు పేదలకు వరం లాంటివని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం కళ్యాణదుర్గంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్, శుద్ధజల ప్లాంటును బుధవారం ఇన్‌ఛార్జి ఆర్డీఓ వినూత్న, డీసీసీ రవిబాబుతో కలిసి ఎమ్మెల్యే, ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల కడుపు నింపేలా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు భాస్కర్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, సీనియర్ నాయకులు మల్లికార్జున, ఆర్.జి.శివశంకర్, రామ్మోహన్‌చౌదరి, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు వై.పి.రమేష్, రామలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ జీవితచరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని విడుదల చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్ర ఎంతో గొప్పదని సేవాలాల్ ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు పేర్కొన్నారు. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో వెలసిన సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో బుధవారం ఉదయం సేవాలాల్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను చెబుతూ వివిధ భాషల్లో పుస్తకాలు రూపొందించామన్నారు. అనంతరం 'మాతా జగదాంబ' ఆలయంలో దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని జగదాంబ దేవిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ట్రస్ట్ సభ్యులు అశ్వర్థ నాయక్, అర్చకుడు మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం కింద అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోడానికి అవకాశం కల్పించామని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఖుష్బు కొఠారి తెలిపారు. ఇంటర్ అనంతరం ఉన్నత విద్య చదివే విద్యార్థులు రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ చేయడానికి జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌ను కళాశాల ప్రధానాచార్యుల లాగిన్‌లో పొందుపరిచారు. ప్రక్రియ మొత్తం ఈనెల 30 లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. సంబంధిత కళాశాలలోని స్కాలర్ షిప్స్ విభాగంలో విధులు నిర్వహించే సిబ్బంది తక్షణమే విద్యార్థుల దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

కాలుష్య కోరల్లో పచ్చని పంటలు

● దిగుబడిపై తీవ్ర ప్రభావం ● ఆందోళనలో రైతులు



ఎదుగుబొదుగు లేని అరటి తోట

తాడిమర్రి, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పచ్చని కూరగాయలు, పండ్ల తోటలు.. కళకళలాడుతూ పెరగాల్సినవి వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుని.. కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాడిమర్రి మండల పరిధిలోని దాడితోట సమీపాన అదానీ సంస్థ హైడ్రో పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఇందుకుగాను కొండలో భారీ నిర్మాణం చేపడుతున్నారు. ఈక్రమంలో కొండను తవ్వి మట్టిని గుట్టగా పోస్తున్నారు. వందలాది వాహనాలలో తెచ్చిన మట్టి పెద్ద కొండగా తయారైంది. దీనికి ఆనుకునే అరటి, దానిమ్మ, చీనీతో పాటు వరి, టమాటా, మిరప తదితర పంటలు సాగులో ఉన్నాయి. మట్టికొండ నుంచి గాలికి వస్తున్న తెల్లటిపొడి దిగువన ఉన్న తోటలపై పడుతోంది. ప్రధానంగా అరటికాయలు పిందెదశలోనే రాలిపోతున్నాయి. దానిమ్మ పూత నిలువడటం లేదు. వరిపైరు పెరగడం లేదు. దీంతో రూ.లక్షలు ఖర్చుచేసి రసాయన మందులను పిచికారీ చేసినా ఫలితం లేకుంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



అరటి చెట్టుపై తెల్లగా ఇలా..

600 ఎకరాల్లో...

హైడ్రో పవర్ ప్రాజెక్టు సమీపంలోనే వంద మంది రైతులకు సంబంధించిన 600 ఎకరాలు సాగులో ఉన్నాయి. పరిశ్రమ నుంచి వస్తున్న తెల్లటి పొడితో పంటలు దెబ్బతింటున్నాయి. రూ.లక్షలు అప్పుచేసి పంటలను సాగు చేయగా ఎదుగుబొదుగు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అరటి సాగు చేసిన ఆరు నెలలకు సుమారు ఆరు అడుగులు పెరిగి.. గెలలు వీడాల్సి ఉంది. వాయు కాలుష్య ప్రభావంతో మొక్క మూడు అడుగులకే పరిమితమైంది. ఇప్పటికే అరటి సాగుచేసి ఆరు నెలలు గడుస్తోంది. ఇంత వరకు గెలలు ఏర్పడలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటల్లో పిందెలు రాలిపోతున్నాయి. ఇటీవల ధర్మవరం ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్.. కడప జిల్లా పర్యటనకు దాడితోట మీదుగా వెళుతుండగా. . బాధిత రైతులు కలిసి సమస్యను వివరించారు. రూ.లక్షల పెట్టుబడులు వృథాగా పోతాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి స్పందించి.. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



పిందె దశలోనే రాలుతున్నాయి..

ఆరు నెలలైనా మొక్క పెరగడం లేదు



నాలుగు ఎకరాలలో రూ.6 లక్షలు ఖర్చుచేసి అరటి సాగు చేశా. మొదటి నుంచి మొక్క పెరగకపోవడంతో పిలకలు నాసిరకమని అనుకున్నా. మిగతా తోటల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. మొక్కలపై తెల్లటి పొడి పడుతుండటంతో సమస్యను గుర్తించాం. పలు రకాల మందులు పిచికారీ చేసినా ఎలాంటి ఫలితం లేదు. **- శ్రీనివాస్‌రెడ్డి, రైతు**

పరిష్కారం చూపాలి



అరటి, టమాటా సాగు చేశాను. రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే వృద్ధిలోకి రావడం లేదు. తోటలపై పడుతున్న పొడి తొలగించాలని ప్రయత్నిస్తే సాధ్యం కావడం లేదు. రోజూ ఇదే పరిస్థితి ఉంది. అధికారులు పరిష్కారం చూపాలి. **- హరి, రైతు**

పరిశీలించి.. తగిన చర్యలు తీసుకుంటాం

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. సమస్యను ఉన్నతాధికారులతోనూ చర్చిస్తా. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
- మహేష్, ఆర్డీవో..ధర్మవరం

డిగ్రీ పరీక్ష ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, అధికారులు

ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలలో మే నెలలో నిర్వహించిన యూజీ హానర్స్ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు బుధవారం ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు విడుదల చేశారు. బీఏ విద్యార్థులు 461 మందికి 108 మంది ఉత్తీర్ణులయ్యారు. బీబీఏ 818 మందికి 353 మంది, బీసీఏ 174 మందికి 62, బీసీఎం 4512 మందికి 1635, బీఎస్సీ 2586 మందికి 1234 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 39.67 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్ కోసం ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల మెరుపులు



పతకాలు సాధించిన క్రీడాకారులు

అనంతపురం, క్రీడలు, న్యూస్‌టుడే : ఈ నెల 6 నుంచి 8వరకు తిరుపతిలో జరిగిన పాఠశాల రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. అండర్ 14, అండర్ 17, తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 38 కేజీల విభాగంలో కె.ద్రిషణ, 45 కేజీల విభాగంలో ఎల్.గౌతం కృష్ణారెడ్డి, 63 కేజీల విభాగంలో వి.హరి చరణ్‌తేజ పసిడి పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4, 5 తేదీల్లో రైల్వే కోడూరులో జరిగిన అండర్ 19 పోటీల్లో 68 కేజీల విభాగంలో ఎం.లిఖిత్‌కుమార్ బంగారు పతకం, నివాస్ రజతం సాధించారు. జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు నవంబరులో మధ్యప్రదేశ్‌లో జరగనున్నాయి. స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వారి వారి పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, తైక్వాండో అకాడమీ సభ్యులు అభినందించారు.

అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం, క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్ జిల్లా అండర్ -14 క్రికెట్ జట్టును జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి ప్రకటించారు. గ్రూప్-బీ విభాగంలో నరసరావుపేటలో జరగనున్న అండర్-14 క్రికెట్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుంది. ఈ నెల 10 నుంచి 23 వరకు ఈ పోటీలు జరగనున్నాయి.

ఎంపికైన జట్టు వివరాలిలా... టీ కిరణ్‌కుమార్(కెప్టెన్), కె.ఆషీశ్ ఆచారి (ఉపసారథి), గోకుల్, ఆదినారాయణరెడ్డి, హేమచంద్ర నాయక్, రోహిత్, పంకజ్‌మీనా, భవన్‌రెడ్డి, కార్తిక్, హేమంత్‌కుమార్, ప్రణధీర్, లిఖిత్, దేవస్కంద, వెంకటసాయి, దేవాన్ష్ రోహిత్, ఉత్తేజ్ యాదవ్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ జట్టుకు శిక్షకుడిగా ఆర్.కుమార్ వ్యవహరిస్తున్నారు.



ఎంపికైన జట్టు సభ్యులు

మంత్రతంత్రాలు నమ్మడమే ప్రాణాలు తీసింది

● నగలు కాజేయాలనే ధర్మవరం సీఐ తల్లి దారుణ హత్య ● నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నిందితుడిని చూపుతున్న అన్నమయ్య ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వయసు రీత్యా వచ్చే అనారోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు నమ్మిన మంత్ర తంత్రాలు, మూఢ నమ్మకాలు వృద్ధురాలి ప్రాణాలు తీశాయి. తనకు పరిచయం ఉన్న కుటుంబానికి చెందిన యువకుడే శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం సీఐ తల్లిని హత్య చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. మదనపల్లెలో సంచలనం సృష్టించిన ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి పేరం స్వర్ణకుమారి (63) హత్య కేసులో నిందితుడైన వెంకటేష్‌ను బుధవారం అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఎస్పీ వివరాలు వెల్లడించారు. స్వర్ణకుమారి కుమారుడు ఉద్యోగ రీత్యా ధర్మవరం సీఐగా పనిచేస్తుండగా ఆమె మదనపల్లెలోనే ఉంటున్నారు. వీరి ఇంటి పక్కనే ఉండే వెంకటేష్ స్వగ్రామానికి చెందిన యువకుడే కావడంతో ఏదైనా తెప్పించుకోవాలన్నా, ఎక్కడైనా వెళ్లాలన్నా అతని సాయం తీసుకునేవారు. వెంకటేష్, అతని స్నేహితుడు అనీల్ ఆర్థిక సమస్యలతో స్వర్ణకుమారి నగలు కాజేయాలని పథకం వేశారు. ఆమెకు మూఢ నమ్మకాలను అలుసుగా తీసుకుని తన స్నేహితుడు ఇంటికి స్వామీజీ వచ్చాడని అతను మంత్రిస్తే జబ్బులు తగ్గిపోతాయని వెంకటేష్ నమ్మబలికాడు. దీంతో గతనెల 28న అతనితో పాటు ద్విచక్రవాహనంపై వెళ్లిన ఆమెను నీరుగట్టువారిపల్లెలోని సాయిరాంవీధికి తీసుకెళ్లి ముందుగా అనుకున్న పథకం ప్రకారమే ఆమె కొబ్బరి నీళ్లలో మత్తు మాత్రలు కలిపి ఇచ్చారు. ఆమె కొంత సమయానికి స్పృహ కోల్పోగా సుత్తితో తలపై కొట్టి చంపేశారు. అదే రోజు ఆమె నుంచి నగలు తీసుకుని స్థానిక ఫైనాన్స్ సంస్థలో రూ.4.97 లక్షలకు కుదువ పెట్టారు. తన తల్లి కనపడకపోవడంతో కుమారుడు నాగేంద్రప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 2న అదృశ్యం కేసు నమోదు చేసి పలు బృందాలతో విచారణ ప్రారంభించారు. ఇందులో సాంకేతిక ఆధారాలతో వెంకటేష్ నిందితుడిగా గుర్తించి అతని కోసం గాలిస్తుండగా మంగళవారం మదనపల్లె - బెంగళూరు మార్గంలోని చీకలబైలు చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేశారు. నిందితుడు ఇచ్చిన వివరాల మేరకు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం అనంతరం పక్కనే అంత్యక్రియలు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఫైనాన్స్ సంస్థలో పెట్టిన నగలను రికవరీ చేశారు. అలాగే ఆమెను సాయిరాం వీధి నుంచి అయోధ్యనగర్‌కు అద్దెకు తీసుకున్న కారును సీజ్ చేశారు. వెంకటేష్‌ను అరెస్టు చేశామని ఈ కేసులో నిందితులుగా ఉన్న అనీల్, ఈ హత్యకు సహకారం అందించిన అనీల్ తల్లి రమాదేవి, ఫైనాన్స్ సంస్థ నుంచి తెచ్చిన డబ్బులో రూ.లక్ష తీసుకున్న వెంకటేష్ తల్లి ఎల్లమ్మలను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. వీరి కోసం ఓ బృందం గాలిస్తోందన్నారు. అరెస్టు చేసిన నిందితుడు వెంకటేష్‌పై పీలేరు, మదనపల్లెలలో కేసులు ఉన్నాయని స్పష్టం చేశారు. గంజాయి మత్తులో హత్య చేశారని సమాచారం ఉందని విలేకరులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా వెంకటేష్ గంజాయి తీసుకోవడంతో పాటు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని అయితే ఈ హత్య దానికోసం జరగలేదన్నారు. కేవలం నగలు కాజేసేందుకు మాత్రమే జరిగిందని తెలిపారు. ఈ కేసులో నిందితులను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన సీఐ కళా వెంకటరమణ, సాంకేతిక నిపుణుడు రాఘవరెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది మహమ్మద్, నరసింహులు, రఘునాథ్‌రెడ్డిలకు జిల్లా ఎస్పీ రివార్డులు అందజేశారు.

రాగిపాత్రకు మహిమలున్నాయంటూ మోసం

ముగ్గురి అరెస్ట్, రూ.25 లక్షల నగదు స్వాధీనం



నిందితులు శివసంతోష్, మంజునాథ్‌రెడ్డి, ప్రతాప్. చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు, రాగిపాత్ర

ఈనాడు, హైదరాబాద్-రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: తమ వద్ద ఉన్న పురాతన రాగి పాత్రకు అద్భుత మహిమలున్నాయంటూ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.25లక్షల నగదు, రాగిపాత్ర, 7 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర వివరాలు తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన శివసంతోష్, చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన జి.మంజునాథ్‌రెడ్డి, బెంగళూరుకు చెందిన ప్రతాప్ ముఠాగా ఏర్పడి రైస్‌పుల్లింగ్ పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన శశికాంత్‌కు మిత్రుడి ద్వారా మంజునాథ్‌రెడ్డి పరిచయమయ్యాడు. తాను రైస్‌పుల్లింగ్ యంత్రంతో రూ.10కోట్లు లాభపడినట్టు మంజునాథ్‌రెడ్డి అతడికి వివరించాడు. దాన్ని కొనేందుకు చాలామంది పోటీపడుతున్నారని తన పలుకుబడితో సొంతమయ్యేలా సహకరిస్తానంటూ భరోసానిచ్చాడు. కొద్దిరోజుల తరువాత శశికాంత్‌కు ఎస్‌డీరోడ్‌లోని ఓ హోటల్‌లో శివసంతోష్‌ను పరిచయం చేశాడు. తన వద్ద ఉన్న రాగి పాత్ర శక్తిని తెలుసుకునేందుకు డీఆర్‌డీవో రూపొందించిన స్కానర్ ద్వారా పరీక్షించుకోవచ్చని సలహా ఇచ్చాడు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తగా ప్రతాప్‌ను రంగంలోకి దింపి పరిచయం చేశారు. స్కానర్‌పై పరీక్షించేందుకు అడ్వాన్స్‌గా ఈనెల 6న రూ.25లక్షలు తీసుకున్నారు. శశికాంత్ రాగి పాత్ర గురించి అడిగితే మరో రూ.25లక్షలు కావాలంటూ మెలికపెట్టారు. అనుమానం వచ్చిన బాధితుడు మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టి ముగ్గురిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రూ.2కోట్లు, కరీంనగర్ నివాసి రూ.40లక్షలు, నిజామాబాద్‌లో ఉంటున్న ఒకరు రూ.10లక్షలు ఈ ముఠా చేతిలో మోసపోయినట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. విజయవాడ, గుంటూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పెద్దఎత్తున బాధితులున్నట్టు అంచనా వేస్తున్నారు. ఈ ముఠా పురాతన రాగిపాత్రలో మహిమలున్నాయంటూ అందులో రసాయనం ఉంచి బియ్యం పోసేవారు. కొంత సమయానికి అవి పచ్చరంగులోకి మారటంతో తేలికగా నమ్మేవారు.

ఆశ చూపి.. డబ్బులు లాగేసి!

➠ రూ.65 లక్షలు దోచుకున్న సైబర్ నేరగాళ్లు ➠ ఆలస్యంగా వెలుగుచూసిన నేరాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: సైబర్ నేరాల గురించి నిత్యం మీడియా, సోషల్ మీడియా, పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా ప్రజలు మోసపోతూనే ఉన్నారు. అత్యాశ, అవగాహన లేమితో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. తక్కువ పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆశజూపిన సైబర్ నేరగాళ్లు ఇద్దరు బాధితుల నుంచి ఏకంగా రూ.65 లక్షలు కాజేసిన ఘటన నగరంలో ఆలస్యంగా వెలుగు చూసింది.

● నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో నివశిస్తున్న సోమశేఖర్‌కు ఇటీవల ఓ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'తాను కేరళకు చెందిన తన్వీర్ అని పరిచయం చేసుకున్నాడు. షేర్ మార్కెటింగ్‌లో తనకు కొన్నేళ్లుగా అనుభవం ఉందని, తమకు చెందిన 'ఐపీవో' షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అతి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ జూపాడు. అతని మాటలు నమ్మిన బాధితుడు తనకు ఉన్న వివిధ బ్యాంకు ఖాతాల నుంచి రూ.32.19 లక్షలు అపరిచిత వ్యక్తి ఖాతాకు బదిలీ చేశాడు. రోజులు గడిచినా చెల్లించిన డబ్బు రెట్టింపు కాకపోవడంతో బాధితుడు.. నేరగాడిని అడిగాడు. అందుకు బదిలీ చేసిన మొత్తంలో మరో 18 శాతం నగదును బదిలీ చేయాలని కోరాడు. అపరిచిత వ్యక్తిపై అనుమానం రావడంతో ఆరా తీశాడు. అలాంటి షేర్ మార్కెట్ లేదని తెలుసుకున్నాడు. తిరిగి అవతలి వ్యక్తికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



● నగరంలోని చంద్రమౌళికి గత నెలలో సంజనరామ్, భరత్ భాస్కర్ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేశారు. తమకు గోల్డ్ మైనింగ్‌లో అపార అనుభవం ఉందని, అందులో పెట్టుబడులు పెడితే రెట్టింపు ఆదాయం ఇస్తామని, తమ మైనింగ్‌కు సంబంధించి 'మెజారీ యాప్'నకు 'సెబీ' నుంచి అనుమతులు ఉన్నాయని నమ్మబలికారు. వ్యాపార భాగస్వామిగా చేరాలని ఒత్తిడి తెచ్చారు. అత్యాశకు పోయిన బాధితుడు తన బ్యాంకు ఖాతా నుంచి అవతలి వ్యక్తులు సూచించిన బ్యాంకు ఖాతాకు రూ.33 లక్షలు బదిలీ చేశాడు. త్వరలో మైనింగ్ కార్యకలాపాలు, ఆదాయం గురించి మాట్లాడుకుందామని తెలిపారు. నెల రోజులు దాటినా అవతలి వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తిరిగి నేరగాళ్లు ఇచ్చిన ఫోన్ నంబర్లకు ప్రయత్నించగా స్పందించలేదు. మోసపోయానని గ్రహించి ఫిర్యాదు చేశాడు.

విధులకు వెళ్తుండగా ఆగిన ఉద్యోగి గుండె



రంగనాథ్

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే : మడకశిర మండలం గుర్రపుకొండ గ్రామానికి చెందిన రంగనాథ్ (45) బుధవారం విధులకు వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయన శూన్యపెట్టుబడి ప్రకృతి వ్యవసాయం (జడ్‌బీఎన్‌ఎఫ్) సంస్థ అమరాపురం మండలం తమ్మడేపల్లి యూనిట్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నారాయన. ఉదయాన్నే ద్విచక్ర వాహనంపై విధుల నిమిత్తం వెళ్తుండగా మార్గమధ్యంలో ఛాతిచొప్పి వచ్చింది. నెమ్మదిగా వాహనాన్ని రోడ్డు పక్కన వదిలి అక్కడిక్కడే కుప్పకూలిపోయారు. గతంలో గుండెకు సంబంధించి చికిత్స చేయించుకున్నారాయన. రంగనాథ్ మృతికి జడ్పీఎన్ఎఫ్ సిబ్బంది సంతాపాన్ని తెలియజేశారు.

చీనీ మొక్కలు, బిందు సేద్యం పరికరాల కత్తిరింపు



దుండగులు కత్తిరించిన చీనీ మొక్కలను చూపుతున్న రైతు రత్నమ్మ

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలంలోని ఓ వ్యవసాయ పొలంలో సాగు చేసిన చీనీ మొక్కలను, బిందు సేద్యం పరికరాలను దుండగులు కత్తిరించారు. బాధితుల వివరాల మేరకు.. కలగళ్ల గ్రామానికి చెందిన రత్నమ్మ కుటుంబానికి మరుట్ల-2 పరిధిలో 5.10 ఎకరాల తోట ఉంది. అందులో బోరు ఆధారంగా నెలన్నర కిందట 800 చీనీ మొక్కలు నాటారు. మంగళవారం రాత్రి దుండగులు 350 మొక్కలను, బిందు సేద్యం పరికరాలను కత్తిరించారు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు కుటుంబం మొక్కలు, పరికరాలను చూసి రోదించారు. రూ.లక్షలు ఖర్చు చేసి, కష్టపడి సాగు చేసిన చీనీ మొక్కలను దుండగులు కత్తిరించి పడేయడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయారు. కూడేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చౌకబియ్యం పట్టివేత

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న చౌక బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సీఐ సురేశ్‌బాబు తెలిపిన వివరాలిలా.. మండలంలోని లత్తవరం తండాకు చెందిన దేవేంద్ర నాయక్, వజ్రకరూరు మండలం ప్యాపిలికి చెందిన సాయికుమార్, శివశంకర్, కొనకొండ్లకు చెందిన నారాయణస్వామి, భావనేశ్ 140 సంచుల బియ్యాన్ని ఓ వాహనంలో మంగళవారం రాత్రి పొద్దుపోయిన తరువాత తరలిస్తుండగా హనుమాన్ నగర్‌లో పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలి

హిందూపురం, న్యూస్‌టుడే : వీరశైవలింగాయత్‌లను ఓబీసీ జాబితాలోకి చేర్చాలని దీనికి హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంతపురం ఎంపీ అంబికాలక్ష్మీనారాయణలు కృషి చేయాలని హిందూపురం వీరశైవ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులు వీరభద్రప్ప, సంపత్‌కుమార్, రమేశ్, చంద్రశేఖర్, నాగరాజు, శంకరప్ప, శివ ఈశ్వరప్ప, నాగేంద్ర, నంజుండప్ప తదితరులు ఇరువురు పార్లమెంట్ సభ్యులను అనంతపురంలో బుధవారం రాత్రి కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వీరశైవలింగాయత్‌లు బీసీ జాబితాలో ఉన్నారని కేంద్రంలో ఓబీసీలో చేర్చాలన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ మాట్లాడుతూ తప్పక పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే దిగుబడి

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు పంటల సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి వి.తిమ్మప్ప పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హరేసముద్రం, బేగార్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కంది, మొక్క జొన్న, రాగి, పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలందించారు. కంది ఆశాజనకంగా ఉంది. అయితే పంటకు సెనగపచ్చ పురుగు సోకింది. దీని నివారణకు క్వినల్‌ఫాస్ అనే మందును 400 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరా పంటకు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహమూర్తి, సెరికల్చర్ టీపీ వెంకటరామిరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

చిలమత్తూరు, న్యూస్‌టుడే : చిలమత్తూరు ఎంపీడీఓగా రమణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన చిలమత్తూరు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేసి బదిలీపై పెనుకొండకు వెళ్లారు. ప్రత్యామ్నాయ ఏర్పాటులో భాగంగా ఆయన్ను ఎంపీడీఓగా నియమించారు.

రొద్దం, న్యూస్‌టుడే : రొద్దం ఎంపీడీఓగా రాంకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కార్యాలయం సిబ్బంది ఆయన్ను సత్కరించారు.

గుడిబండ: గుడిబండ మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా గంగాధర్, జూనియర్ అసిస్టెంట్‌గా రఘురామ్ విధులకు చేరారు. అనంతపురం నుంచి గుడిబండకు వీరు బదిలీపై వచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని వారు తెలిపారు.

మల్లాపల్లి చెరువు పనుల ప్రారంభం

గోరంట్ల : మండలంలోని మల్లాపల్లి చెరువుతూము పక్కన నుంచి నీరు వృథాగా పోతున్న నేపథ్యంలో 'ఈనాడు'లో కథనాలు రావడంతో మంత్రి సవిత ఆదేశాలతో తెదేపా నాయకులు బుధవారం పనులు ప్రారంభించారు. మంత్రి భర్త వెంకటేశ్వరరావు, మండల తెదేపా నాయకులు పొక్లెయిన్‌తో మొదటిరోజు కంపచెట్లు తొలగించి మార్గం ఏర్పాటు చేశారు. గురువారం నుంచి తూము వద్ద పనులు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. నీటిపారుదల శాఖ డీఈ లక్ష్మీనారాయణ పనులు పరిశీలించారు.

చౌరవ చూపితేనే సంపద సృష్టి



మెళవాయిలో వినియోగంలో లేని సంపదతయారీ కేంద్రం

మడకశిర గ్రామీణం, అమరాపురం, న్యూస్‌టుడే : మడకశిర నియోజకవర్గంలో సంపద తయారీ కేంద్రాలపై గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో అవి నిరుపయోగంగా మారాయి. గత తెదేపా హయాంలో వాటిని సదుద్దేశంతో నిర్మించారు. అయితే గత ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో మొత్తం 63 చెత్తతో సంపద తయారీ కేంద్రాలున్నాయి. వీటిలో చాలా కేంద్రాలు ఊరు బయట, కుంటలు, చెరువుల్లో నిర్మించడంతో వర్షాలకు అందులో నీరు చేరి దెబ్బతింటున్నాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో వాటి మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో సుమారు 30 కేంద్రాలు బీటలువారాయి. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని వాటికి మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తెస్తే రైతులకు నాణ్యమైన సేంద్రియ ఎరువు తక్కువ ధరలో లభిస్తుంది. అటు పంచాయతీలకూ ఆదాయం చేకూరుతుంది.

● అమరాపురం, మద్దనకుంట సంపద తయారీ కేంద్రాలను చెరువుల పక్కన నిర్మించారు. నాలుగేళ్ల కిందట భారీ వర్షాలకు చెరువుల నిండడంతో రెండు కేంద్రాలు ఏడాదిపాటు నీటమునిగాయి. దీంతో నేల కుంగి అందులోని తొట్టెలు బీటలు వారాయి. కె.శివరం సంపద తయారీ కేంద్రంలో నిర్మించిన సిమెంటు తొట్టెలు బీటలు వారి శిథిలావస్థకు చేరుకున్నాయి.

నిరుపయోగంగా కేంద్రాలు

● మడకశిర మండలం ఆమిదాలగొందిలో చెరువు పక్కన సంపద తయారీ కేంద్రం నిర్మించారు. అందులో ఇప్పటి వరకు చెత్తను నింపి రైతుకు కిలో ఎరువు తయారు చేసి ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో ఆ కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. అదే విధంగా మెళవాయి సంపద కేంద్రం ఉపయోగించకపోవడంతో చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. ఆవరణంలో చెత్త సేకరణ సైకిళ్లను పడేశారు.

● అగళిలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రంలో నిర్మించిన తొట్టెల్లోనే పాము పుట్ట పెరిగింది. దీంతో కేంద్రంలో ఎరువుల తయారీకి ఆటంకంగా మారింది.

● గుడిబండ మండలం ముతుకూరులో సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. ఇక్కడ ఒక్క రోజు కూడా ఎరువులు తయారు చేయలేదు. తిమ్మలాపురం, కొంకల్లు, మండలపల్లి, దేవరహట్టి, కేవీఎన్‌పల్లి, కరికెర, రాళ్లపల్లిలోని సంపద తయారీ కేంద్రాలు ఎనిమిదేళ్లైనా ప్రారంభానికి నోచుకోలేదు.

సేంద్రియ ఎరువు కావాలి



గతంలో మామిడి, సపోటా తదితర పంటలు సాగుచేశా. వాటికి తెగుళ్లు ఆశించడంతో ప్రస్తుతం కొత్తగా డ్రాగన్ ఫ్రూట్ సాగుచేశా. రెండేళ్లుగా దిగుబడి అందుతోంది. సేంద్రియ ఎరువులు లేక దిగుబడి, నాణ్యత తగ్గుతోంది. సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువులను తయారుచేసి అందిస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుంది. **- మాధవరెడ్డి, రైతు, గౌడనకుంట, అమరాపురం మండలం**

ఉపయోగంలోకి తెస్తాం..

సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయించి వాటిని ఉపయోగంలోకి తెస్తాం. సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం చేకూరుస్తాం. రైతులకు వర్మీ కంపోస్టు ఎరువు అందిస్తాం. **- సోనిబాయి, ఎంపీడీఓ, మడకశిర**



అమరాపురంలో సంపద కేంద్రంలో బీటలు వారిన తొట్టెలు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య : పట్టణంలోని చారిత్రిక కట్టడం గగన్‌మహల్ ఎదురుగా రాత్రిపూట వీధి దీపం వెలగడంలేదు. చెరువు గేరికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. **- యువరాజు, స్థానికుడు**

సమాధానం : వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపం మరమ్మతు చేయిస్తాం. **- శ్రీనివాసులు, నగర పంచాయతీ కమిషనర్,**
- న్యూస్‌టుడే, పెనుకొండ

స్పందనకు వందనం

పెనుకొండ, న్యూస్‌టుడే : పట్టణ శివారులోని శ్రీసాయిచరణాశ్రమం వద్ద కోళ్ల వ్యర్థాలు వేస్తుండటంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ సమస్య 'మేమున్నాం.. మీకుతోడు'గా శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైంది. దీంతో నగర పంచాయతీ కార్మికులు స్పందించి చెత్తను తొలగించి శుభ్రం చేశారు.

గుంతలు పూడ్చివేత

పాలసముద్రం (గోరంట్ల), న్యూస్‌టుడే : మండలంలోని పాలసముద్రంలో హిందూపురం రహదారిలో పెద్దగుంతలు ఏర్పడి నీటికుంటలా మారి ప్రమాదాలకు నిలయంగా మారిన వైనంపై 'ఈనాడు'లో 'కుంట కాదు ప్రధాన రహదారి' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి స్పందించి స్థానిక తెదేపా నాయకులతో గుంతలకు మట్టితోలించారు. స్థానిక నాయకులు మనోహర్, బెల్లాలచెరువుచంద్ర, మూర్తి, గంగాధర్ తదితరులు ట్రాక్టర్లు ఏర్పాటుచేసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. గురువారం కూడా మట్టి తోలుతున్నట్లు వారు తెలిపారు.

పంటకోత ప్రయోగాల పరిశీలన



దిగుబడుల నమోదును పరిశీలిస్తున్న సంయుక్త కలెక్టర్

గోరంట్ల, న్యూస్‌టుడే : మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుసెనగ, వరి పంటకోత ప్రయోగాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు చేపట్టిన ప్రయోగాలపై జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం పరిశీలన (సూపర్‌చెక్) నిర్వహించారు. ఈ సందర్భంగా పాలసముద్రం, మల్లాపల్లి, పులేరు, మలసముద్రం, గౌనివారిపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో వ్యవసాయ శాఖాధికారులు నమోదు చేసిన దిగుబడి వివరాలను జేసీ పరిశీలించి ఆ పొలాలను సందర్శించారు. జరగబోయే ప్రయోగాలను పక్కాగా చేయాలని ఆదేశించారు. స్థానిక తహసీల్దారు మారుతి, హిందూపురం డివిజన్ ఏడీ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ మునికృష్ణ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



హిందూపురం సాంస్కృతికం : సరస్వతిదేవిగా..



హిందూపురం సాంస్కృతికం : మహాకాళరాత్రిగా కొల్లాపురమ్మ



పరిగి: కాళరాత్రిదేవిగా శ్రీ సప్తమాతృకాదేవి



మడకశిర : దానిమ్మ గింజలతో కన్యకాపరమేశ్వరీదేవి

అలరించిన చిన్నారుల భరతనాట్యం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని కోటలో ఉన్న శారదాదేవి ఆలయంలో బుధవారం అమ్మ వారికి ప్రత్యేక పూజలను తరం శారద మహిళా మండలి వారిచే లలితాసహస్రనామ పారాయణం, భక్తిగీతాలాపన నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం గౌరిబిదనూరు నుంచి వచ్చిన దివ్యశివనారాయణ దిక్సూచి నృత్యాలయం చిన్నారులు పుష్పాంజలి, శ్రీకృష్ణుడు, అమ్మవారి, వినాయకుని భక్తిగీతాలకు కూచిపూడి, భరతనాట్యం చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



అమరాపురం: కుమారిదేవిగా కన్యకాపరమేశ్వరి

దసరా శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో బుధవారం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన ఆలయాలన్నీ విద్యుత్తు దీపకాంతులతో అలరారాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. **- న్యూస్‌టుడే బృందం**



గోరంట్లలో : సరస్వతీదేవిగా వాసవీమాత



రొళ్ల : కాళికాదేవి అలంకరణలో రత్నగిరి కాళికాంబాదేవి



పెనుకొండ : శ్రీగిరిమహేశ్వరీ శక్తిపీఠంలో సరస్వతీదేవి



లేపాక్షిలో సరస్వతీ దేవీగా దుర్గాదేవి



రొద్దం : అలంకరణలో రేణుకాఎల్లమ్మ ..

సంప్రదాయం.. శోభాయమానం

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు..

సోమందేపల్లి, పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి (విజయదశమి) ఉత్సవాల్లో భాగంగా సోమందేపల్లి దుర్గానగర్‌కు చెందిన శ్యామలమ్మ, దివంగత పురుషోత్తంరెడ్డి దంపతులు, పెనుకొండకు చెందిన అర్చకులు శేషప్ప స్వామి ఇంట ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఎన్నో ఏళ్లుగా నిర్విఘ్నంగా ఈ సాంప్రదాయాన్ని వారు కొనసాగిస్తుండటం విశేషం. ఈ నెల 3న తొమ్మిది రోజుల దసరా ఉత్సవాలు ప్రారంభంకాగా.. ఆ రోజు నుంచి వారి ఇంట్లో రోజూ పండగే. ఈ బొమ్మల కొలువులో పురాతన కాలం నాటి ప్రతిమలు ఉండటం విశేషం. గ్రామీణ వాతావరణం, పాడి పంటలు, పిల్లల పార్కు, విద్యార్థులతో కూడిన పాఠశాల ఆవరణ, భరతమాత, తెలుగు తల్లి, పంటల సాగుకు రైతులు ఉపయోగిస్తున్న వివిధ యంత్రాలు, దేవతల ప్రతిమలున్నాయి. ఆకట్టుకునేలా బొమ్మల కొలువును ఏర్పాటు చేయడంతో చుట్టూ ఉన్న మహిళలు, పెద్దలు వచ్చి ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. బొమ్మలు వారిని కట్టిపడేస్తున్నాయి. 9 రోజుల పాటు పలువురు మహిళలను ఇంటికి ఆహ్వానించి బొమ్మల కొలువును చూపించి.. వారికి పసుపు - కుంకుమ, పూలు, ప్రసాదం అందిస్తున్నారు.



ఆసక్తిగా తిలకిస్తున్నారు..

- శేషప్ప స్వామి, అర్చకులు, పెనుకొండ

మా ఇంట వందేళ్ల నుంచి బొమ్మల కొలువు ఏర్పాటు సంప్రదాయంగా వస్తోంది. దసరా ఉత్సవాల్లో భాగంగా 9 రోజుల పాటు మా ఇంట పండగ వాతావరణం ఉంటుంది. పిల్లలు, పెద్దలు, మహిళలు మా ఇంటికి వచ్చి ఎంతో ఆసక్తిగా బొమ్మల కొలువును తిలకిస్తున్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తుండటం వల్ల మా ఇంట సుఖ సంతోషాలున్నాయి.

ఏళ్లనాటి ఆచారం..

- అత్తా కోడలు శ్యామలమ్మ, గౌరి, సోమందేపల్లి

మా కుటుంబంలో ఎన్నో ఏళ్ల నుంచి శరన్నవరాత్రి (దసరా) ఉత్సవాల్లో బొమ్మల కొలువు ఒక సంప్రదాయంగా నిర్విఘ్నంగా చేపడుతున్నాం. ఐదు తరాలుగా కొనసాగుతుండగా.. మేము 50 ఏళ్లుగా ఘనంగా నిర్వహిస్తున్నాం. ఏటా ఈ బొమ్మల కొలువు చేపడుతుండటంతో రోజూ పిల్లలు, మహిళలు, యువతులు, బాలికలు వచ్చి సంతోషంగా వీటిని తిలకించి వెళ్తున్నారు. ఏటేటా మరిన్ని కొత్త బొమ్మలను ఈ కొలువులో ఉంచుతున్నాం. దీంతో ఇంటా - బయటా నిండిపోతున్నాయి. ఇందులో తమ బంధువులు, గ్రామస్థుల సహకారం మరువలేనిది..



బొమ్మల కొలువ వద్ద మహిళలు

రైలు కింద పడి ఆత్మహత్య

హిందూపురం, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన ఆదినారాయణ (55) బుధవారం వేకువ జామున గుడ్డం రంగనాథస్వామి దేవాలయ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య కు పాల్పడ్డారు. ఉదయం అతను ఆత్మహత్య యత్నానికి పాల్పడటం గుర్తించిన స్థానికులు రైల్వే ఎస్‌ఐ బాలాజినాయక్‌కు సమాచారం అందించటంతో వెంటనే అక్కడికి చేరుకుని బాధితుడిని పరిశీలించారు. కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్సల కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

క్రైం కార్నర్

పరిగి, న్యూస్‌టుడే : పరిగిలో బుధవారం రాత్రి ఎస్‌బీఐ ఏటీఎం సమీపాన ద్విచక్రవాహనం ఢీకొని గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి భార్య మంజుల (48) తీవ్రంగా గాయపడ్డారు. పరిగిలో ఓ వివాహ రిసెప్షన్‌కు కుటుంబ సభ్యులతో కలసి మంజుల నడిచి వెళుతుండగా హిందూపురం బోయ పేటకు చెందిన వాహన చోదకుడు మడకశిర వైపు నుంచి వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మంజుల కాలు విరిగింది. ఆమెను 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్‌ఐ హిదాయతుల్లా ఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కొడికొండ (చిలమత్తూరు) : మండలంలోని కొడికొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మొరసనపల్లి పంచాయతీ కందుర్పర్తి గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై చిలమత్తూరుకు బయలుదేరారు. ధర్మవరానికి చెందిన పవన్‌కుమార్ తమ సొంత పనుల నిమిత్తం సోమఘట్టకు కారులో వెళ్తున్నారు. కొడికొండ గ్రామ సమీపాన ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మీప్రసన్నకు గాయాలయ్యాయి. 108లో చిలమత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురానికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెనుకొండ: పట్టణ శివారులో 44వ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని సిమెంటు ట్యాంకర్ ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల వివరాల మేరకు.. మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన మాధవ ద్విచక్రవాహనంపై వెళుతుండగా సిమెంటు ట్యాంకర్ ఢీకొనడంతో కాలు విరిగింది. అతన్ని మొదట పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

హిందూపురం : హిందూపురం గ్రామీణ మండలం వినాయక్‌నగర్ వద్ద రాత్రి గురుతెలియని వాహనం రహదారిపై వెళ్తున్న రాము (45)ను ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

రొద్దం, న్యూస్‌టుడే : రొద్దంలోని కల్లు దుకాణం వద్ద రొద్దకంపల్లి వాసి అక్కులప్ప, కందుకూర్లపల్లి గ్రామానికి చెందిన రమేశ్ మద్యం మత్తులో వాగ్వాదానికి దిగి ఘర్షణ పడ్డారు. రమేశ్ కత్తితో దాడి చేయడంతో అక్కులప్పకు గాయమైంది. బాధితుడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ శాషావలి తెలిపారు. కేసు విచారణ చేస్తున్నామన్నారు.


నవోదయ విద్యార్థిని ప్రతిభ

లేపాక్షి, న్యూస్‌టుడే : యూనివర్సల్ పోస్టల్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతి చదువుతున్న హేమలత రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి మూడో బహుమతి పొందినట్లు తపాలా శాఖ సహాయ సూపరింటెండెంట్ మల్లికార్జున తెలిపారు. ప్రపంచ తపాలా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం విద్యార్థినికి రూ.5 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నవోదయ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ముంతాజ్‌బేగం, హెడ్ పోస్ట్ మాస్టర్ మార్కెండేయ, స్థానిక పోస్టు మాస్టర్ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామం అలవరచుకోవాలి

హిందూపురం, న్యూస్‌టుడే : ఉద్యోగులు శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సక్రమంగా నిర్వహిస్తారని తపాలా సూపరింటెండెంట్ మల్లికార్జున అన్నారు. తపాలా వారోత్సవాల్లో భాగంగా బుధవారం తపాలా సిబ్బందికి ఫిట్‌పోస్ట్ - ఫిట్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్ట్‌మాస్టర్ మార్కండేయ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి తపాలా సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నిర్లక్ష్యం అల్లుకుపోతోంది



అమరాపురం మండలంలోని అగౌడనకుంట ఎన్టీఆర్ సుజల కేంద్రం ముందు భాగంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభం స్టేవైర్‌కు చెట్ల తీగలు అల్లుకున్నాయి. 11 కేవీ లైన్‌కు అవి తాకుతున్నాయి. చెట్ల తీగగుండా విద్యుత్తు ప్రవహించి ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అధికారులు స్పందించి తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు శాఖ లైన్‌మెన్ మహాలింగప్ప దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో చెట్ల తీగల్ని తొలగిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, అమరాపురం**

రోడ్డు ఆక్రమణతో రాకపోకలకు ఇబ్బందులు

కిరికెర మేజర్ పంచాయతీ పరిధిలోని సిరికల్చర్‌కాలనీలో నివాస గృహాలకు వెళ్లే రోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించడంతో రోడ్డు కుచించుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయి. వర్షం వస్తే నీరంతా బయలు ప్రదేశానికి సజావుగా వెళ్లక.. నిల్వ ఉండి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్యను ఎంపీడీఓ సరస్వతీ దృష్టికి తీసుకెళ్లగా గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి కాలనీలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం**



జగన్‌ను కలిసిన కౌన్సిలర్లు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే : హిందూపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ పదవిని పార్టీ నిర్ణయించిన అభ్యర్థి కైవసం చేసుకొనేలా ప్రతి కౌన్సిలర్ సహకరించాలని వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆ పార్టీ కౌన్సిలర్లకు సూచించినట్లు నాయకులు వెల్లడించారు. ఇటీవల తెదేపాలో చేరి, అక్కడ ఇమడలేక మళ్లీ సొంత పార్టీలోకి వెళ్లిన నలుగురు కౌన్సిలర్లు మల్లికార్జున, పరుశురాం, రహమత్‌బీ, నాగమణిలు బుధవారం జగన్‌ను తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. పార్టీని వీడి తప్పిదం చేశామని, ఇక కొనసాగుతామని ఆయనతో వారు పేర్కొన్నారు. 38 మంది కౌన్సిలర్లు, ఎంపీ, ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్న హిందూపురం మున్సిపల్ కౌన్సిల్‌లో వైకాపా బలం 30, కూటమి బలం 10గా ఉంది. ఇటీవల ఛైర్ పర్సన్‌తో పాటు మరో 10 మంది వైకాపా కౌన్సిలర్లు ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో తెదేపాలో చేరారు. దీంతో తెదేపాకు మున్సిపాలిటీలో మెజార్టీ రావడం, వ్యక్తిగత కారణాలతో ఛైర్ పర్సన్ ఇంద్రజ తన పదవికి రాజీనామా చేయడంతో, తెదేపాకు చెందిన కౌన్సిలర్ రమేశ్‌ను ఛైర్మన్ చేయాలని నిర్ణయించారు. ఛైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ వస్తుందని, భావిస్తున్న సమయంలో తెదేపాలో చేరిన కౌన్సిలర్లలో నలుగురు తిరిగి వెళ్లిపోవడం గమనార్హం. ఛైర్మన్‌గా గెలుపొందాలంటే 21 మంది మద్దతు అవసరం కాగా, తెదేపా కూటమికి 17 మంది ఉండగా, మరో ఇద్దరు వైకాపా సభ్యులు మద్దతు తెలుపుతున్నారు. దీంతో తెదేపా బలం 19గా మారింది. ఈ తరుణంలో వైకాపాకు ఉన్న 21 మంది సభ్యులు గట్టిగా నిలబడితే, వారికే ఛైర్మన్ పదవి దక్కుతుండటంతో పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషా చరణ్, నియోజకవర్గ సమన్వయ కర్త దీపికా రంగంలోకి దిగారు. పార్టీ కౌన్సిలర్లను నేరుగా పార్టీ అధినేత వద్దకే తీసుకెళ్తున్నారు. ఇటీవల 17 మంది ఆయన్ను కలవగా, తాజాగా నలుగురు కలవడం గమనార్హం.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

నేటి నుంచి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు తెలిపారు. హనుమాన్ కూడలి ఆర్.వి.జానకిరామయ్య వీధికి వెళ్లు దారిలో వాసవీమాత కన్యాకా పరమేశ్వరి, హనుమాన్ దేవాలయ ప్రాంగణాలకు దగ్గరలోని మైదానంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు గురువారం చైతన్య నవదుర్గల ప్రదర్శన, శుక్రవారం చైతన్య శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ప్రదర్శన, శనివారం సీతారామ లక్ష్మణ హనుమ ప్రదర్శనలు, ఊరేగింపులు, రావణ దహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

12న శిల్పారామంలో దసరా ఉత్సవాలు

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పుట్టపర్తి పట్టణంలోని శిల్పారామంలో ఈనెల 12న దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఏవో రమేష్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జబర్దస్త్ కళాకారులు బుల్లెట్ భాస్కర్, ఫైమా, నరేష్‌లతో కామిడీ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. దీంతో పాటు చిత్తూరు జిల్లాకు చెందిన కళా తరంగిణి వారి ఆధ్వర్యంలో డీజే పాటలతో నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఏటా దసరా మహోత్సవాల సందర్భంగా శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పుట్టపర్తి పట్టణంతోపాటు పరిసర ప్రాంత ప్రజలు ఉత్సవాలకు హాజరై వినోదాలు ఆస్వాదించాలని కోరారు.

పీఆర్సీ అమలు చేయాలి

పుట్టపర్తి: ప్రభుత్వం 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని ఏపీ వైఎస్సార్ ఉపాధ్యాయ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎనుములపల్లి ప్రాథమిక పాఠశాలలో సంఘ సమావేశం నిర్వహించారు. బకాయిలు వెంటనే చెల్లించాలని, వేసవి సెలవుల్లో పనిచేస్తున్న, బదిలీలు నిర్వహించాలని, ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగుల జీతాలు ప్రతినెలా మొదటి వారంలో చెల్లించాలని, అనవసర యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలను ప్రకటించాలని, 117 జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. సమావేశంలో ఏపీ వైఎస్సార్ ఉపాధ్యాయ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

ధర్మవరం: ధర్మవరం ఆర్టీసీ డిపోలో పెంచిన పనిభారం తగ్గించకుంటే నిరసన కార్యక్రమాలు ఉద్ధృతం చేస్తామని ఎంప్లాయిస్ యూనియన్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి హెచ్చరించారు. ధర్మవరం డిపోలో 4వ రోజు నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తీర్చకుండా డీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంఘం డిపో కార్యదర్శి ముస్తఫా, ఏడీసీ మల్లికార్జున, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక.. అక్రమాలకు వేదిక

- అనుమతుల్లేని నిర్మాణాలకు అధికారుల వెన్నుదన్ను
- మున్సిపాలిటీ ఆదాయానికి గండి



లక్ష్మీచెన్నకేశవపురంలో గృహ నిర్మాణం పేరుతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్

ధర్మవరం పట్టణం, ధర్మవరం, న్యూస్‌టుడే: అక్రమ నిర్మాణాలు, భూ ఆక్రమణలతో ధర్మవరం పట్టణ ప్రణాళిక విభాగం అవినీతికి కేంద్ర బిందువుగా మారింది. ఈ విభాగంలో కొందరు అధికారుల అవినీతి కారణంగా అనుమతులు లేని నిర్మాణాలు పట్టణంలో ఎక్కడ చూసినా పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అధికారులకు అడిగినంత ముట్టచెబితే ఎంతటి నిర్మాణానికైనా అనుమతులు ఒకేసారి ఇస్తున్నారు. ఫలితంగా మున్సిపల్‌శాఖకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రణాళిక విభాగంలో అనేక అక్రమాలు జరిగినా.. నాయకుల అండదండలు ఉండటంతో బయటకు రాలేదు. ఆ శాఖలోని కీలక అధికారులకు భవన నిర్మాణాల యజమానుల నుంచి రూ.లక్షల్లో ముడుపులు అందుతుండటంతో వారి అవినీతి అక్రమాలకు అంతులేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. చివరకు ప్రజలు ఉపయోగించే రోడ్లు, డ్రైనేజీ కాలువలను ఆక్రమించి భవంతులు నిర్మిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్లైనా లేదు. పైగా అక్రమార్కులకే వారు వంతపాడుతుండటం విశేషం.

ఆ సర్వేయర్లు ఒకే అంటేనే..

పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ప్రణాళిక విభాగంలో ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లదే హవా. వారు చెప్పిన వారికే అధికారులు అనుమతులు ఇస్తూ రూ.లక్షలు సంపాదించుకుంటున్నారు. పట్టణంలో 9 మంది ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉండగా.. వారిలో ఇద్దరు మాత్రం కీలకంగా వ్యవహరిస్తున్నారు. భవంతులు నిర్మించాలని ఎవరైనా టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదిస్తే.. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వీరిని కలవాలని సూచిస్తారు. ఇతర సర్వేయర్ల నుంచి పత్రాలు తెచ్చుకుంటే అధికారులు అదిలేదు.. ఇది లేదంటూ భవన యజమానులను ముప్పుతిప్పలు పెడుతూ వెనక్కు పంపిస్తున్నారు. ఒక్కో భవంతి నిర్మాణానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ కమిషనర్ హయాంలో వీరి హవా నడిచిందని, నాయకుల అండదండలు ఉండటంతో ప్రణాళిక విభాగాన్ని అవినీతికి చిరునామాగా మార్చివేశారనే ఆరోపణలు ఉన్నాయి.

ఒక్క ఫిర్యాదునూ పరిశీలించలేదు

పట్టణ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా.. ప్రణాళిక అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. లేనిపక్షంలో ఆ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం వారికి ఉంటుంది. గత 5 ఏళ్ల కాలంలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలపై ప్రణాళిక అధికారులకు ఫిర్యాదులు అందినా.. ఒక్కటీ పరిశీలించలేదు. నాన్ లేఅవుట్లలో చేపట్టే నిర్మాణాలకు అధికారుల నుంచి అనుమతులు ఉండవు. కానీ, ధర్మవరం పట్టణంలో డబ్బులిస్తే ఎక్కడైనా ఏరకమైన భవంతులనైనా నిర్మించుకోవచ్చు. గృహనిర్మాణాల పేరుతో అనుమతులు తీసుకుని వాణిజ్య సముదాయాలు నిర్మించుకుంటున్నారు. ఇలాంటి భవనాలు 100 నుంచి 150 దాకా ఉన్నట్లు సమాచారం. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ప్రియాంకనగర్, గాంధీనగర్, శాంతినగర్, మున్సిపల్ కార్యాలయం, లక్ష్మీచెన్నకేశవపురం, ఎర్రగుంట్ల, సుందరయ్యనగర్ తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణం కొనసాగుతున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. అక్రమ కట్టడాల నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరైనా పనులు చేస్తే పరిశీలించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: విద్యుత్తు సరఫరాలో అంతరాయం కారణంగా ఇళ్లలో పరికరాలు పాడవుతున్నాయి. ఇబ్బందులు పడుతున్నాం.

- నరసింహమూర్తి, బాబు, నాగరాజు అమడగూరు

సమాధానం: లైన్‌ట్రిప్ కావడంతో సమస్య వస్తోంది. సాయంత్రం వేళ విద్యుత్తు వినియోగం అధికంగా ఉండటంతో అంతరాయం ఏర్పడుతోంది. పరిష్కరించడానికి చర్యలు చేపడతాం.

- చంద్రనాయక్, అమడగూరు ఏఈ

సమస్య: అమడగూరులో మసీదు, పాత సినిమా హాలు, అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో తాగునీటి పైప్‌లైన్ దెబ్బతినడంతో నీరు వదిలిన సమయంలో వృథాగా పోతోంది. **- శ్రీనివాసులు, రాము, రవి**

సమాధానం: గతంలో వేసిన పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. సమస్యను పరిశీలించి చర్యలు చేపడతాం.

- మమత, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, అమడగూరు

పరిపాలనాధికారికి ఎంపీడీవో బాధ్యతలు



రామానాయక్‌ను అభినందిస్తున్న సిబ్బంది

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న రామానాయక్‌కు ఎఫ్‌ఎస్‌సీ ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు చెపట్టారు. ఈ సందర్భంగా సహచర సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా క్రికెట్ జట్టుకు కదిరి విద్యార్థులు



జిల్లా జట్టుకు ఎంపికైన రోహిత్, భువన్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న అంతర్‌జిల్లాల అండర్-14 క్రికెట్ పోటీలకు కదిరికి చెందిన రోహిత్, భువన్ ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. జిల్లా క్రికెట్ సంఘం నిర్వహించిన పోటీల్లో వీరిద్దరు చక్కటి ప్రతిభ చాటడం ద్వారా జిల్లా కమిటీకి ఎంపికయ్యారు. వాల్మీకి పాఠశాల విద్యార్థి రోహిత్, సాధన పాఠశాల విద్యార్థి భువన్ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తూ అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికవడం పట్ల కదిరి మండల క్రికెట్ సంఘం అధ్యక్షుడు, శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్, ఉపాధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ, ఎంఈవో-2, ఉపాధ్యాయ బృందం

ముదిగుబ్బ: స్థానిక శాంతి ఆనంద పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న అఖిల్, కార్తికేయ జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ తెలిపారు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో శాంతిఆనంద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కార్తికేయ, అఖిల్ ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అలాగే సీనియర్స్ విభాగంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రభావతి పాల్గొని మూడో స్థానంలో గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులను ముదిగుబ్బ గ్రామీణ సీఐ శ్యామరావు, ఎంఈవో-2 రమణప్ప, యూనియర్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ చంద్రళ, వైద్యాధికారి నిఖిత, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సచివాలయ ఉద్యోగికి తాఖీదు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం కాళసముద్రం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో పోలప్ప తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. రిజిస్టర్‌లో సంతకం చేయని సర్వేయర్ రవినాయక్‌కు మెమో జారీ చేశారు. సచివాలయ ఉద్యోగులు కచ్చితమైన సమయ పాలన పాటించాలని సూచించారు.


కమనీయం.. దేవీ అలంకారం



ముదిగుబ్బలో వాసవీమాత



ధర్మవరం పట్టణంలో సరస్వతీదేవిగా..



తాడిమర్రి: దాడితోట గ్రామంలో..



తనకల్లు: సరస్వతీ అలంకారంలో



కదిరి గ్రామీణం: మల్లాలమ్మకు అలంకరణ



పుట్టపర్తి పట్టణం: ధనలక్ష్మిగా వాసవీమాత



బుక్కపట్నంలో వాసవాంబ



పుట్టపర్తి: ప్రత్యేక అలంకరణలో సత్యదేవత



కదిరి పట్టణం: అర్చకుడు పాపయ్యశాస్త్రి ఇంట్లో బొమ్మల కొలువు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల వ్యాప్తంగా భక్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏడోరోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతీదేవి, శాకంబరి, అన్నపూర్ణదేవి, లలితాపరమేశ్వరి, మహాలక్ష్మి, ధనలక్ష్మి అలంకరణలో కొలువుదీరారు. భక్తులు ఆలయాలకు చేరుకుని కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, హోమాలు, క్షీరాభిషేకాలు నిర్వహించి భక్తితో కొలిచారు. జగజ్జననీ లోకపావని అంటూ అమ్మవారిని స్తుతించారు. – న్యూస్‌టుడే బృందం



కదిరి పట్టణం: వాసవాంబ గ్రామోత్సవంలో ఆర్యవైశ్యులు

ప్రజాప్రతినిధులకు శిక్షణ

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల పరిధిలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీల నిర్వహణపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో పోలప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీరాజ్ చట్టాలు, విధులు, పరిపాలన, కార్యక్రమాల నిర్వహణ అంశాలపై శిక్షణ ఇచ్చారు.

తలుపుల: పంచాయతీ అధికారాలు, విధులు, అభివృద్ధి, సంక్షేమం తదితర అంశాలపై పంచాయతీల వార్డు సభ్యులు, ఉపసర్పంచులకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామానాయక్ మాట్లాడుతూ ప్రతి వార్డు సభ్యుడు గ్రామాల అభివృద్ధిలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

నంబులపూలకుంట(గాండ్లపెంట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు అందుతున్న నిధుల ద్వారా అందించే సంక్షేమ పథకాలపై ఈవో ఆర్డీ మాధవరెడ్డి అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించి బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు.

చినుకు పడితే ప్రమాదమే..



పాముదుర్తి గ్రామ ప్రధాన రహదారిలో గుంతలమయమైన రోడ్డు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని పాముదుర్తి, గరుగు తండా 2 కిలోమీటర్ల పరిధిలో ప్రధాన రహదారి గోతులమయమైంది. చినుకు పడితే గుంతల్లో నీరు నిలిచి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అడుగు లోతు గుంతల్లో తరచూ వర్షం వచ్చినప్పుడల్లా నీరు నిలిచి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిమార్లు అధికారులకు తెలిపినా కనీస మరమ్మతులు చేయడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ శ్రీనివాసులును వివరణ కోరగా ఇప్పటికే గ్రామస్థులు సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారని, ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పాచిపట్టిన నిర్లక్ష్యం



9వ వార్డులో రోడ్డుపై నిలిచిన మురుగు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 15 అడుగుల రోడ్డుపై అడుగు మేర నీరు నిలిచి, పాచిపట్టి రెండడుగుల మేర గడ్డి పెరిగి నెలలు గడిచినా మున్సిపల్ యంత్రాంగం స్పందించడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటనాగేపల్లి 9వ వార్డులో పరిస్థితి ఇది. భగవాన్ సత్యసాయి బాబా మాతృమూర్తి ఈశ్వరాంబ జన్మించిన ప్రదేశంలో స్మారక దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకున్న వీధులివి. ప్రజలు ప్రధాన రహదారిలోకి వెళ్లాలంటే రెండు వీధులు దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి. దగ్గరలోని పాఠశాలకు వెళ్లే పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఈశ్వరాంబ దేవాలయానికి వచ్చే భక్తులు, చుట్టుపక్కల నివాసముండే ప్రజలు దుర్గంధం భరించలేక ముక్కు మూసుకుని వెళ్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్‌ను వివరణ కోరగా సమస్య మా దృష్టికి రాలేదని, నీటి నిల్వకు కారణాలు తెలుసుకుని గురువారమే శుభ్రం చేయిస్తానని తెలిపారు.

అధ్వానంగా రహదారి.. ప్రతిపాదనలకే సరి



కంకరతేలిన యర్రగుంటపల్లి ప్రధాన మార్గం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మున్సిపాలిటీ పరిధిలోని యర్రగుంటపల్లి రహదారి దశాబ్దకాలంగా కంకరతేలి అధ్వానంగా మారింది. దాదాపు ఒకటిన్నర కిలోమీటరు ఉన్న ఈరోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల కిందట వేసిన రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కంకరతేలిన దారిలో ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి యర్రగుంటపల్లి రహదారి మరమ్మతులు చేపట్టాలని ఎన్జీఓ కాలనీకి చెందిన చిరు వ్యాపారి శివారెడ్డి కోరారు. సమస్యను మున్సిపల్ డీఈ విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా రహదారి మరమ్మతులకు రూ.70 లక్షలతో ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే ప్రాధాన్య క్రమంలో రోడ్డు వేస్తామన్నారు.

చిన్నబోతున్న వంకలు, చెరువులు



అలంపూర్ వద్ద వంక కాలువైంది.. వర్షాలు వస్తే రోడ్డు ప్రశ్నార్థకమే?

తలుపుల, న్యూస్‌టుడే: నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులతో సహజసిద్ధంగా ఉన్న వాగులు, వంకలు, చెరువులు చిన్నబోతున్నాయి. ప్రస్తుతం వర్షాలు లేవు. కానీ, భారీ వర్షాలు వచ్చినప్పుడు రోడ్డు పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తలుపుల మండలం బి.కొత్తపల్లి నుంచి కొడికొండ చెక్‌పోస్టు వరకు రూ.438 కోట్లతో చెపట్టిన రోడ్డు విస్తరణతో తలుపుల, కదిరి గ్రామీణ మండలాల్లోని పలు వంకలు, వాగులు, చెరువులు రూపురేఖలు మారిపోవడమేకాక చిన్నబోతున్నాయి. అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందేనని పలువురు వాపోతున్నారు.

- అలంపూర్ అడవుల్లోంచి కుంట్లపల్లిచెరువుకు భారీగా నీటిని తీసుకొచ్చే వాగు పిల్లకాలువలా మారిపోయింది. ఆ వాగును పూర్తిగా పూడ్చివేసి దానిపక్కనే చిన్న కాలువ ఏర్పాటు చేశారు. ఆ వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తే నీరంతా రోడ్డుపై ప్రవహించే ప్రమాదం ఉంది.
- బట్రేపల్లి అడవిచెరువు మరువలో సగభాగం రోడ్డు నిర్మాణానికే పోతుంది. ఈ పాటికి ఆ చెరువు నీటితో నిండి ఎప్పుడూ కళకళాడేది. ఈఏడు వర్షాలు లేకపోవడంతో వెలవెలబోతుంది. చెరువు పొడవునా రోడ్డు పనులు జరుగుతుండటంతో చెరువు చిన్నబోతుంది. నీరొచ్చినా పెద్దగా నిలిచే అవకాశం ఉండదని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువులు, వంకలు వాగులకు భద్రతకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తాం

బట్రేపల్లి అడవి చెరువు, అలంపూర్ వంక విషయం పరిశీలించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇస్తాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకొంటాం.

- గిరి, ఆర్‌అండ్‌బీ డీఈ, కదిరి

ఉద్యోగి హఠాన్మరణం



బాబావలి

ముదిగుబ్బ: గుండెపోటుతో బాబావలి (33) అనే ఉద్యోగి కుప్పకూలి మృతి చెందారు. ముదిగుబ్బకి చెందిన బాబావలి అనంతపురంలోని ఆర్ అండ్‌బీ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం పాల ప్యాకెట్ కోసం వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా గుండెపోటు రావడంతో కిందపడ్డారు. స్థానికులు గమనించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ పెద్దదిక్కు మృతితో తీవ్ర కన్నీటి పర్యంతమయ్యారు.

ఎన్ఎంఎంఎస్ గడువు పొడిగింపు

కొత్తచెరువు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు ఏడీ లాజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధి కూలీ మృతి



మస్తాన్‌బీ

నంబులపూలకుంట (గాండ్లపెంట): ఎన్పీకుంట మండలం గోకనపల్లికి చెందిన ఉపాధి కూలీ మస్తాన్‌బీ (55) మృతి చెందింది. బుధవారం ఉదయం పండ్ల మొక్కలు నాటేందుకు వెళ్లింది. పనులు చేస్తుండగా ఒక్కసారిగా కళ్లు తిరిగి కిందపడింది. గుర్తించిన కూలీలు ప్రథమ చికిత్స అందించి 108లో కదిరి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మరణించినట్లు నిర్ధారించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కనగానపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ముక్తాపురం కూడలి వద్ద ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో ముక్తాపురం గ్రామానికి చెందిన రవి(45) తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం నిమిత్తం బెంగళూరులోని ఓ వైద్యశాలలో వైద్యసేవలను పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లి శివార్లలోని రింగ్ రోడ్డు వద్ద వేగనిరోధకం గమనించక ద్విచక్ర వాహనదారుడు ప్రమాదానికి గురయ్యాడు. బత్తలపల్లి నుంచి అనంతపురానికి ద్విచక్ర వాహనంలో వెళుతున్న యువకుడు వేగనిరోధకం వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. గాయపడిన యువకుడిని స్థానికులు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. యువకుడి వద్ద వివరాలు లభించకపోవడం, చరవాణి కిందపడి పగిలిపోవడంతో ఎవరైంది తెలియరాలేదని బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

గూడ్స్‌షెడ్‌కొట్టాలలో భూవివాదం.. దాడి



గాయపడిన ఓబులేసు

ధర్మవరం: పట్టణంలోని గూడ్స్‌షెడ్‌కొట్టాలలో బుధవారం భూవివాదంలో జరిగిన ఘర్షణలో రామ్‌నగర్‌కు చెందిన ఐదుగురు గాయపడ్డారు. గాయపడినవారిలో అంగజాల ఓబిలేసు, చిన్న లింగప్ప, బాలప్ప, చిన్న ఓబిలేసు, బాలవెంకటేష్ ఉన్నారు. వీరిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమపై గూడ్స్‌షెడ్‌కొట్టాలకు చెందిన మల్లి, సతీష్, తిరుపాలు, రామాంజి, కిరణ్, వినోద్ హాకీ బ్యాట్‌లు, కర్రలతో దాడి చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ..

వృద్ధుడి పరిస్థితి విషమం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలో బుధవారం జరిగింది. కదిరి మండలం దానియనిచెరువుకు చెందిన కృష్ణయ్య పెళ్లిళ్ల పేరయ్యగా పనిచేస్తారు. సొంత పనినిమిత్తం మదనపల్లెకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కాండ్లమడుగుక్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణయ్యను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఆసుపత్రి అవుట్‌పోస్టు సిబ్బంది సమాచారాన్ని బి.కొత్తకోట పోలీసులకు తెలియజేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని బాలసముద్రం పంచాయతీ మారప్పగారిపల్లికి చెందిన చిన్న కుళ్లాయప్ప పురుగుమందు తాగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంటి సమీపంలో విషం తాగి పడి ఉండగా గుర్తించిన కుటుంబ సభ్యులు జనసేన ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తీసుకెళ్లాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

నల్లమాడ, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షురాలు సునీత భాయి పేర్కొన్నారు. గత సమావేశంలో ఆయా శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి నివేదికల తీరు, శాఖలవారీగా సమీక్ష ఉంటుందని తెలిపారు. మండలాధికారులు ప్రణాళిక నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

హుండీ ఆదాయం రూ.6.72 లక్షలు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం యర్రదొడ్డి గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. 9 నెలలు కాలానికి హుండీ ఆదాయం రూ.6,72,941 వచ్చినట్లు ఆలయ ఈవో రవీంద్ర రాజు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాదాయశాఖ తనిఖీ అధికారి నరసింహ, మాజీ ఛైర్మన్ నరసారెడ్డి, మాజీ సర్పంచి కుపేంద్రరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

కనగానపల్లి : కనగానపల్లి మండలం ఎంపీడీఓగా అనిల్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే మండలంలో ఈఓ ఆర్డీగా పని చేస్తున్న ఆయనకు పదోన్నత కల్పించి పూర్తి బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓకు సిబ్బందితోపాటు పలువురు పూలమాలలతో సత్కరించి స్వాగతించారు.